క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

చీమకుర్తి: ఎంఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోనుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఎంఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మక్కెన థామస్ ఆర్థిక సహకారంతో వాటిని అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గొట్టిపాటి రాఘవరావు, సాధు మోహన్‌రావు, హెచ్ఎం బండి శ్రీనివాసరావు, టీచర్లు పాల్గొన్నారు.

బెట్టింగ్ జూదరుల అరెస్ట్

సింగరాయకొండ: బెట్టింగ్ ఆడుతున్న ముగ్గిరిని అరెస్ట్ చేసిన సంఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సోమరాజుపల్లె పంచాయతీ ఫకీరు పాలెంకు చెందిన షేక్ పాజర్ మండల కేంద్రంలోని ప్రశాంతి థియేటర్ ఏరియాలో నివసిస్తున్న కావటి వెంకటేష్, జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన హుస్సేన్ సాహెబ్‌లను అదుపులోకి తీసుకొని 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారమని ఎస్సై టి. శ్రీరాం తెలిపారు. వీరు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ చేస్తూ అమాయకులను ఈ వృత్తిలోకి లాగారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

గుడ్లూరు (కందుకూరు): మండలంలోని పోట్లూరు గ్రామంలో పేకాట నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఇద్దరితో పాటు, రూ. 20వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు (కందుకూరు): మండలంలోని గుండ్ల పాలెం ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ఇసుక రవాణా నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



దర్శనానికి నిలబడ్డ మహిళా భక్తులు



అమ్మవారి మొక్కులు తీర్చుకుంటున్న మహిళా భక్తులు

అమ్మవారికి అమావాస్య పూజలు

● భక్తిశ్రద్ధలతో చండీ హోమాలు

ఒంగోలు మెట్రో: అమావాస్య శుక్రవారం సందర్భంగా నగరంలో అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంటపాలెంలోని పార్వతీ అమ్మవారికి, బాలాజీ రావు పేటలో శ్రీ కనకదుర్గమ్మ వారికి, కేశవ స్వామి పేటలోని విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో, లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి, కేశవ స్వామి పేటలో లలితా ఆశ్రమంలో లలితా అమ్మవారికి పూజలు జరిగాయి. అలాగే గద్దలగుంట బుర్ర బావి దగ్గర మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి, చెన్నకేశవ స్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిరిడి సాయి బాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర రాజలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో, సమతా నగర్ కాలవ దగ్గర వెలసి ఉన్న కనక దుర్గ అమ్మవారికి, కమ్మ పాలెం లోని కాళికా అమ్మవారి దేవస్థానంలో, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రి అమ్మవారికి, రంగారాయుడు చెరువు దగ్గర కంచి



అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

కామాక్షమ్మ దేవస్థానంలో పూజారులు తీర్థప్రసాదాలు అందించారు. మంగమూరు రోడ్ లోని మిలటరీ కాలనీ యానాది సంఘంలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో ఉదయం ఎనిమిది గంటల నుండి ఆలయ అర్చక స్వాములు అమ్మవార్ల మూలవిరాట్‌కు శ్రీ సూక్తంతో పాలు, పెరుగు, తేనె, చక్కెర, కొబ్బరి నీళ్ల, పండ్ల రసాలతో అభిషేకించి, సుగంధ పరిమళ ద్రవ్యాలు పసుపు కుంకుమ గంధం విభూది చందనం పన్నీరు ద్రవ్యాలతో అభిషేకించి వివిధ రకాల పూలతో చక్కగా పుష్పాలంకరణ గావించారు. శ్రీ చక్రానికి దేవి ఖడ్గమాలతో అష్టోత్తర శత నామావళి పూజలు నిర్వహించి మంగళ హారతులతో భక్తులకు అమ్మవారి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. స్థానిక భక్తులు వారి గ్రామ కులదేవతలకు పొంగలి పాయసాలతో వారి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం పాలకవర్గం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు.

అలరించిన యుగళావధానం

ఒంగోలు మెట్రో: విశ్వ కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటైన మానేపల్లి నాగ కుమార శర్మ, ఇలపావులూరి శేష శ్రీధర శర్మల యుగళావధానం కార్యక్రమం సాహిత్యాభిమానులకు రసానందాన్ని పంచి పెట్టింది. పృచ్ఛకుల ప్రశ్నలకు అవధానులు చక్కటి పూరణలు చెప్పి అలరించారు. భారతీయ సనాతన ధర్మ పరిరక్షణకు విశ్వ కళా భారతి సంస్థ అధ్యక్షుడు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ చేస్తున్న కృషిని వక్తలు అభినందించారు. అవధానంలో పృచ్ఛకులుగా శతావధాని నారాయణం బాల సుబ్రహ్మణ్యం, దూపాటి రామాచార్యులు, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ఎంవీఎస్ శాస్త్రి, ఈదుమూడి ఆంజనేయులు, పింగళి పూర్ణచంద్రరావు, పింగళి శ్రీనివాస రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అవధాని ఇలపావులూరి శేష శ్రీధర శర్మను అవధాన కళావతంస బిరుదుతో ఘనంగా సన్మానించారు. ఆళ్ల సుబ్బా రెడ్డి, శ్రీ లత దంపతులు జ్యోతి ప్రజ



యుగళావధానం కార్యక్రమంలో పాల్గొన్న అవధానులు

్వలన చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాషా సాహిత్యాల పరిరక్షణకు అవధాన విద్యా వ్యాప్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలక్ష్మి కోరారు. యువగళా వధానం కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో సాహిత్యాభిమానులు విచ్చేశారు. విశ్వ కళాభారతి సంస్థ అధ్యక్షుడు నాదెండ్ల జ్వాలా ఉమా మహేశ్వర శర్మ అవధానులను. పృచ్ఛకులను ముఖ్య అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. పొన్నూరు శ్రీనివాసులు అప్రస్తుత ప్రసంగం ఆకట్టుకుంది.

నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి మూలవిరాట్

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు విజయ్‌కాంత్‌శర్మ, నిర్వాహకులు పాతకోట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం అర్చనలు, అభిషేకాలతో పాటు 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 12 గంటలకు అన్నసంతర్పణ, సాయంత్రం స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

● ఎంపీడీఓ శ్రీహరి, పీహెచ్‌సీ డాక్టర్ ఆనంద్‌మోహన్



అధికారులతో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ ఆనంద్‌మోహన్, ఎంపీడీఓ శ్రీహరి

మద్దిపాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శ్రీహరి, పీహెచ్‌సీ డాక్టర్ ఆనంద్‌మోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన డయేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ ఎల్‌సీడీసీ కార్యక్రమం నిర్వహించాలని, కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని వారు తెలిపారు. అదే క్రమంలో డయేరియా రాకుండా నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యార్థులకు వివరించాలని తెలిపారు. డయేరియా రాకుండా తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆశాజ్యోతి, ఈఓపీఆర్‌డీ రఘుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేంద్రరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓ, పలువురు వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఒంగోలు: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఏక్ పెడ్ మాకే నామ్ చేపట్టిన ప్రచారంలో భాగంగా క్విస్ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ డాక్టర్ ఎన్.సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.గాయత్రి, కాలేజీ ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు పర్యావరణం ప్రాధాన్యతను వివరించి సమాజంలో ప్రతి ఒక్కరు మొక్కలు పెంచేలా ప్రచారం చేపట్టాలని విద్యార్థులకు సూచించారు.



మొక్కలు నాటుతున్న క్విస్ విద్యార్థులు

హెల్మెట్ వాడితే ప్రాణాలకు రక్షణ

కొత్తపట్నం: ఇంటి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వాడుకోవాలని ఎస్సై బి.సాంబశివరావు ప్రయాణికులకు వివరించారు. బీచ్ నుంచి వచ్చే ప్రయాణికులను శుక్రవారం ఆపి హెల్మెట్ తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాలు చెప్పిరావని ఎప్పుడు జరుగుతాయో తెలియదని హెల్మెట్ తప్పనిసరిగా వాడుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసి ప్రమాదం జరిగిన వారు ఎంతో మంది ఉన్నారన్నారు. ఒంగోలు నగరం నుంచి బీచ్‌కు వచ్చే యాత్రికులు మందు తాగి వాహనాలు స్పీడ్‌గా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తు చేశారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాక



ప్రయాణికులకు హెల్మెట్ గురించి వివరిస్తున్న ఎస్సై సాంబశివరావు

మద్యం సేవించి సముద్ర స్నానం చేస్తూ అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వివరించారు. పోలీస్ నిబంధనలు పాటించి ప్రయాణం చేయాలని కోరారు.

పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీఎస్‌పురం (పామూరు): జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీని కలెక్టర్ కార్యాలయంలో మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి శుక్రవారం కలిసి బొకే అందజేశారు. కోవిలంపాడు గ్రామ పంచాయతీలో అంతర్గత రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారం, పేదలకు నివేశన స్థలాలు కేటాయింపు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చామని ఆయన తెలిపారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు బుజ్జి తెలిపారు.



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి బుజ్జి

2 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

● రూ.30 వేలు జరిమానా

సింగరాయకొండ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును డ్రైవర్‌తో సహా అదుపులోకి తీసుకున్న సంఘటన శుక్రవారం తెల్లవారుజామున కనుమళ్ల పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. సెబ్ పోలీసుల కథనం ప్రకారం జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటకు చెందిన కె.యోహాన్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా 10 వేల రూపాయల జరిమానా విధించినట్లు సెబ్ సీఐ కె.నరహరి తెలిపారు. ఎస్సై సీహెచ్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం నందనవనం వద్ద పాలేరు నుంచి శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్‌తో సహా సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కె.బిట్రగుంటకు చెందిన కె.ఇమ్మానుయేల్ అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడని, ఇతను రెండోసారి పట్టుబడటంతో రూ.20 వేల జరిమానా విధించామని సెబ్ సీఐ నరహరి తెలిపారు.



నందనవనం వద్ద సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

చెట్ల తొలగింపు నిలువరించాలి



పశువులమేత భూముల్లో తొలగించిన చెట్లు

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్ పురం సర్వేనంబర్ 162 పశువుల మేత భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు పొక్లెయిన్లతో చెట్లు తొలగిస్తున్నారని తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరాకు శుక్రవారం వినతిపత్రం అందజేసినట్లు షేక్ నాయబ్ రసూల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే సర్వే నంబర్‌లో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించవద్దని హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. తక్షణం దీనిపై తహసీల్దార్ ప్రత్యేకదృష్టి సారించి చెట్ల తొలగింపును నిలిపివేయించాలని కోరారు.

నేడు రేబిస్ వ్యాక్సినేషన్

కొనకనమిట్ల: జునోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల పశు వైద్యశాలల్లో కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం చేపట్టినట్లు ఆయా గ్రామాల పశు వైద్యులు అమూల్య, రాజ్యలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు రేబిస్ వ్యాధి నివారణ గురించి వివరించారు. 1885 జూలై 6న లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి మొదటిసారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారని. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో అప్పటి నుంచి అదే రోజును ప్రపంచ జునోషిస్ దినత్సవంగా పాటిస్తున్నారన్నారు. పశు పోషకులు, పశు వైద్య వృత్తిలో ఉన్నవారు, పశువుల డెయిరీలో పని చేసేవారు, పాల ఉత్పత్తులు ఆహారంగా తీసుకునేవారు, సరదదా కోసం కుక్కలు, పక్షులు పెంచుకునేవారికి వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. పశు పక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమించే ముఖ్యమైన జునోటిక్ వ్యాధుల్లో రేబిస్ వ్యాధి(పిచ్చికుక్క కాటు వ్యాధి), బ్రూసెల్లోసిస్ వ్యాధి, బర్డ్ ఫ్లూ, దొమ్మ రోగం(ఆంత్రాక్స్), టీబీ లేదా క్షయ, లెప్టో స్పైరోసిస్ వ్యాధులు ఉన్నాయన్నారు. వ్యాక్సినేషన్‌ను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.



పెంపుడు కుక్కను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి

జగదాంబ అమ్మవారికి పూజలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విగ్రహమూర్తిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం

గిద్దలూరు రూరల్: గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా పట్టణంలోని గాయత్రిమాత ఆలయంలో శుక్రవారం మహాగాయత్రి యజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు, గాయత్రి యజ్ఞం నిర్వాహకులు సూరం నారాయణరెడ్డి మాట్లాడుతూ మానవుడు ఆధ్యాత్మిక జీవనం గడిపితే సవ్యమైన ఆలోచనలు కలుగుతాయన్నారు. ఇటువంటి భక్తి కార్యక్రమంలో పాల్గొని గాయత్రి యజ్ఞం విశిష్టతల గురించి తెలుసుకుంటే జీవితం సుఖవంతం అవుతుందన్నారు. యావత్తు మానవాళి రక్షణ కోసం గాయత్రి యజ్ఞం దోహదపడుతుందన్నారు. యజ్ఞంతో సకల దేవతలు సంతోషిస్తూ ప్రకృతి సమతుల్యానికి కృషి చేస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు బచ్చు వెంకటేశ్వర్లు, లలిత ప్రసన్న, వి.వీరారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కురిచేడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమవేశపు హాలులో సీజనల్ వ్యాధులు, డయేరియాపై మండల కో ఆర్డినేషన్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించిన మాట్లాడారు. ప్రతి గ్రామంలో మురుగు కాల్వ పూడికలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. మలేరియాపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఈ సీజన్లో దోమ కాటు ద్వారా వచ్చే డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా ప్రతి గ్రామంలో క్లోరినేషన్, మురుగు కాల్వల్లో నీరు నిల్వలు ఉన్నచోట దోమల మందు పిచికారీ చేయాలని వైద్యాధికారి పి.ప్రవీణ్ తెలిపారు. ప్రతి శుక్రవారం నీరు నిల్వ ఉన్న పాత్రలను శుభ్రం చేసి మళ్లీ నీరు నిల్వ చేసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.బసవరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బసవరాణి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత



విద్యార్థికి పుస్తకాలు, దుస్తులు అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: స్థానిక బండ్లమిట్టకు చెందిన షేక్ సలాం అనే విద్యార్థికి సూర్యశ్రీ ట్రస్టు చేయూతనందించింది. శుక్రవారం విద్యార్థి చదువుకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు ట్రస్టు సభ్యులు అందించారు. పదో తరగతిలో 90శాతం మార్కులు సాధించిన సలాం తల్లి మరణించడంతో ఆర్థిక ఇబ్బందులతో పుస్తకాలు కూడా కొనలేని పరిస్థితిని తెలుసుకున్నారు. ఈమేరకు ట్రస్టు ప్రవాస భారతీయుడు ఖాజా హుస్సేన్ సహకారంతో విద్యార్థికి పుస్తకాలు, దుస్తులు అందించారు. ఉన్నత చదువులకు ట్రస్టు సహకారం అందిస్తుందని తెలిపారు. సర్దార్ బాష, మార్లెళ్ల సుబ్బారావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాలకు సిద్ధమైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగనగర్‌లో గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం నుంచి ఈనెల 15 వ తేదీ వరకు శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని కేటీఆర్ విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త, వ్యవస్థాపకుడు కుందురు తిరుపతిరెడ్డి శుక్రవారం తెలిపారు. పది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ప్రతి రోజూ అమ్మవారికి అభిషేకం, ఉదయం 9 గంటలకు చండీ హోమం, మధ్యాహ్నం 1 గంటకు మంగళ హారతి తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్ర 6 గంటలకు వారాహి అమ్మ వారికి విశేషముగా సువాసినులచే సామూహిక కుంకుమార్చన, అనంతరం మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయన్నారు.

98 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొండారెడ్డి పల్లి గ్రామంలో డాక్టర్ సందీప్, డాక్టర్ లక్ష్మీ భార్గవి 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతకు కర్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది షేక్ మస్తాన్, డేవిడ్, ఎస్ఎం, ఎంఎల్ హెచ్‌పీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.